క్లుప్తంగా

నేడు జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా జిల్లా ప్రభుత్వాసుపత్రిలో శనివారం ఉదయం 10 గంటలకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పోరుమామిళ్ల : మండలంలోని గానుగపెంట సమీపంలో కంపచెట్ల వద్ద శుక్రవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి రూ.2150 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

అన్నదానం



వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో భోజనం వడ్డిస్తున్న శూలం లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : స్థానిక వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో యదవంశ వృక్షం కువైట్ వారి సహకారంతో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో కావేటి వెంకటరమణ, రాధికల కుమారుడు హన్సిత్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేయడం మంచిదన్నారు. అలాగే సూపర్ బజార్ రోడ్డులోని వినాయక విగ్రహం వద్ద ముగ్గులు పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సొలేషన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో భారతి పాల్గొన్నారు.

రేపు ఆలయ జీర్ణోద్ధరణ



చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామంలో భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం జీర్ణోద్ధరణ ప్రక్రియలో భాగంగా ఆదివారం బాలాలయం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నిరంజన్ రెడ్డి తెలిపారు. రూ.61లక్షల దేవాదాయశాఖ నిధులతో ఆలయాన్ని పునర్నిర్మించనున్నట్లు ఆయన వివరించారు. గ్రామ ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

కస్తూర్బా పాఠశాల పరిశీలన

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మద్దిరెడ్డిపల్లె వద్ద కస్తూర్బా ఉన్నత పాఠశాలను ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. చేతి పంపు మరమ్మతులకు గురైందని, ప్రహరీ విద్యుద్దీపాల సమస్యలు ఉన్నాయని ఉపాధ్యాయులు ఎంపీపీకి తెలిపారు. వారం రోజుల్లో అధికారులకు తెలిపి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు తప్పకుండా విద్యార్థులకు చేరేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పి.రామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన సదస్సు

చాపాడు : పోషకాహార పదార్థాల ఆవశ్యకతను తప్పనిసరిగా తెలుసుకోవాలని చాపాడు సెక్టార్ ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ పేర్కొన్నారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలతో పాటు ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుబ్బరత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవతకు చిరునామా వివేకానంద సేవాశ్రమం

పోరుమామిళ్ల : గిద్దలూరు మండలం జయరామాపురంకు చెందిన గోర్ల వెంకటయ్య(42) చాలాకాలంగా కిడ్నీ వ్యాధికి కడపలో చికిత్స చేయించుకుంటున్నాడు. శుక్రవారం అతను తల్లిని వెంట తీసుకుని కడపలో చికిత్స చేయించుకుని తిరిగి వస్తుండగా పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండ్‌లో మృతి చెందాడు. అతని తల్లి కుమారున్ని ఇంటికి తీసుకపోయే స్తోమతలేదని, తన కున్న ఒక్కగానొక్క కుమారుడు ఇలా జబ్బుతో చనిపోయాడని అంత్యక్రియలు కూడా చేయలేనని పోలీసుల వద్ద వాపోయింది. పోలీసులు వివేకానంద సేవాశ్రమం నిర్వాహకురాలు రామతులసికి సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే సంస్థ ప్రతినిధులు శివ, బొజ్జా ప్రసాద్‌లతో పోరుమామిళ్ల వచ్చి, శవానికి స్నానం చేయించి, తమ వైకుంఠరథంలో తీసికెళ్లి సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించింది.



మృతదేహానికి స్నానం చేయిస్తున్న రామతులసి

వైభవం.. గణనాథుని గ్రామోత్సవం



గ్రామోత్సవంలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడు



రాజుపాలెంలో వివిధ రకాల వేషధారణలో యువకులు



ప్రొద్దుటూరు : నేతాజీ నగర్‌లో నృత్యం చేస్తున్న యువతులు



బద్వేలు : గాంధీనగర్ గ్రామోత్సవంలో యువకుల సందడి



అట్లూరు: మల్లినేనిపట్నం కాలనీలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీర్చిన గణనాథుని విగ్రహాలను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. వినాయక చవితి పర్వదిన సందర్భంగా పూజలందుకున్న ఏకదంతునికి గణపతి ఉత్సవ కమిటీ వారు, భక్తులు బొజ్జగణపయ్యా ఇక సెలవంటూ వీడ్కోలు పలికారు. కొన్ని ఉత్సవ కమిటీల వారు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బాణసంచా పేలుళ్లు, కేరళ సింగారిమేళం, చెక్కభజన, కోలాటం, డప్పువాయిద్యాల సందడి మధ్య ఏకదంతుని గ్రామోత్సవాన్ని పురవీధుల్లో ఘనంగా చేశారు. రంగులు చల్లుకుంటూ జై బోలో గణేష్ మహారాజ్ అంటూ నినాదాలు చేస్తూ ఆనందంగా పార్వతీ పుత్రున్ని సాగనంపారు. దారి వెంబడి భక్తులు కొబ్బరికాయలుకొట్టి కర్పూర హారతులు ఇచ్చి భక్తిశ్రద్ధలతో పూజించారు. కాగా కొన్ని వినాయక విగ్రహాల కమిటీ వేడుకల్లో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీలు, భక్తిగీతాలాపనలు, భజనలు, నృత్య ప్రదర్శన వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక మేదరవీధిలో చౌడమ్మ దేవాలయం వద్ద ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఇన్నర్‌వీల్‌క్లబ్ సెక్రటరి ఉషారాణి, ట్రెజరర్ అనురాధ, రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

మండలంలోని కానపల్లెలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా గణనాథుని గ్రామోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పాల్గొన్నారు. చిన్నారుల కోలాటం, చెక్కభజన, డప్పువాయిద్యాల సందడి నిమజ్జనోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వార్డు మెంబర్ కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని అమృతానగర్‌లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు మున్సిపల్ వైస్ చైర్మన్‌కు శాలువా కప్పి సత్కరించారు.

ఘనంగా గణపయ్యకు వీడ్కోలు

రాజుపాళెం : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండలంలోని రాజుపాళెం, వెలవలి, కొట్టాల తదితర గ్రామాల్లో భక్తులు గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శుక్రవారం సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ బాణసంచా పేల్చుకుంటూ కులమతాలకు అతీతంగా రంగులు చల్లుకుంటూ ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. రాజుపాళెంలో సుబ్బారెడ్డి అనే యువ ఇంజనీర్ డిప్ ద్వారా లడ్డూను దక్కించుకున్నాడు. రాజుపాళెంలోని ఇందిరా కాలనీ యువకుల వేషధారణ అందరిని అలరించింది. అనంతరం వెల్లాల, టంగుటూరు, కూలూరు, వెలవలి గ్రామాల్లోని కుందూ నది వద్ద బొజ్జ గణపయ్య విగ్రహాలను నిమజ్జనం చేశారు. కొర్రపాడులో వైఎస్సార్ సీపీ నాయకుడు దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా వినాయకుడికి పూజలు చేసి నిమజ్జనం చేశారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఏర్పాటు చేసిన పలు విగ్రహాలు 5వ రోజు నిమజ్జనంలో భాగంగా శుక్రవారం గాంధీనగర్, బెస్తవీధి, వినాయకనగర్ , సురేంద్రనగర్, ఎగువ బ్రాహ్మణవీధి, వెంకటయ్యనగర్, గాండ్లవీధి, కుమ్మరికొట్టాలు, మిద్దెలవారిపాళెం, ఆంజనేయనగర్‌లలో విగ్రహాలు నిమజ్జనానికి బయలుదేరాయి. స్థానిక బెస్తవీధిలో గ్రామోత్సవం వెంట దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. గాంధీనగర్‌లోని గ్రామోత్సవంలో హైదరాబాద్ డప్పు కళాకారుల విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి. ఆయా విగ్రహాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. అర్బన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు అన్ని విగ్రహాల ఊరేగింపుల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోలాహలంగా గణనాథుని నిమజ్జనం

గోపవరం : ఆయా గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులను శుక్రవారం కోలాహలంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అన్ని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి తరలించే ముందు లడ్డు, ఇతర సామగ్రిని భక్తులు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు. రాచాయపేటలో ఉట్టికొట్టే కార్యక్రమంలో యువతీ యువకులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బద్వేలు రూరల్ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

అట్లూరులో..

అట్లూరు : మండలంలోని పలు గ్రామాల నుంచి వినాయక విగ్రహాలను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. మండలంలో 66 విగ్రహాలను నెలకోల్పగా మూడవ రోజుకొన్ని విగ్రహాలను నిమజ్జనం చేయగా ఐదవరోజు శుక్రవారం కొన్ని విగ్రహాలను నిమజ్జనంకు తరలించారు.

కాశినాయనలో..

కాశినాయన : మండలంలోని నరసాపురంలో 5వ రోజైన శుక్రవారం వినాయకుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. లడ్డు, చెరకుగడలు, వెలక్కాయలను వేలంపాట వేశారు. యువత రంగులు చల్లుకుంటూ డప్పువాయిద్యాలతో చిందులు వేస్తూ నిమజ్జనాన్ని నిర్వహించారు. లడ్డు వేలంపాటలో వినాయకుని లడ్డు రూ.92 వేలు పలికింది. గ్రామంలో 7 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

పాత పెన్షన్ విధానం మాత్రమే అమలు చేయాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానం మాత్రమే అమలు చేయాలని ఏపీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ పేర్కొన్నారు. స్థానిక ఎద్దుల వెంకట సుబ్బమ్మ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో విరామ సమయంలో శుక్రవారం సీపీఎస్ కన్వీనర్ సురేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సుబ్బరాజు యాదవ్ మాట్లాడుతూ జీపీఎస్‌కు ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రామలక్ష్మి, జిల్లా కార్యదర్శి గంటా రామ్మోహన్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ కుమార్, లక్ష్మీ చౌడయ్య, పట్టణ ఉపాధ్యక్షురాలు రాధా లక్ష్మి, రామచంద్ర, ప్రభాకర్, గురయ్య, జోసెఫ్, శంకర్, జాకీర్, నిర్మల, లక్ష్మీనారాయణమ్మ, ఆశాజ్యోతి, వెంకట గీత, అరుణ, హరిత, అరుణ కుమారి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మెడికల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబుకు శనివారం వారు వినతిపత్రం అందజేశారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యలను పరిష్కరించడంతో పాటు జీఓ నెంబర్ 549 ప్రకారం రూ.16 వేలు వేతనాలు ఇవ్వాలన్నారు. మహిళా కార్మికులకు ప్రత్యేకమైన 5 సెలవులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటి సభ్యులు లక్ష్మీదేవి, జయలక్ష్మి పాల్గొన్నారు.


పీహెచ్‌సీ ల్యాబ్ తనిఖీ



నీటితొట్టిని పరిశీలిస్తున్న అధికారి నరసింహారెడ్డి

బి.కోడూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను శుక్రవారం పోరుమామిళ్ళ మలేరియా సబ్ యూనిట్ అధికారి టక్కోలు నరసింహారెడ్డి తనిఖీ చేసి పలు రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం ద్వారా లార్వాసర్వే చేయాలని తెలిపారు. గ్రామాల్లో మురికినీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో అబేట్ ద్రావణాన్ని స్ప్రే చేయించాలన్నారు. అనంతరం పాయలకుంట్ల పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, పబ్లిక్ హెల్త్ నర్సు పుష్పాంజలి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగమణి, సూపర్‌వైజర్ జాన్‌విలియం, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రయ్య, ఎల్‌డీసీ రాజమ్మ, స్టాఫ్‌నర్సులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : డెంగీ జ్వరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని గోపవరం, సోములవారిపల్లె, కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని ఖాదర్‌బాద్ గ్రామాల్లో శనివారం డెంగ్యూ జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. డ్రైడేలో భాగంగా పరిసరాల శుభ్రత, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, చంద్రకళ, చంద్రశేఖర్, జ్యోతి, అరుణ, ఆశా వర్కర్లు నాగలక్ష్మి, బాల నాగమ్మ, మాబుచాన్, పుష్పలత, ఖాజాబీ, రహమతున్నీసా పాల్గొన్నారు.

అక్రమ కేసు ఎత్తివేయాలి

పోరుమామిళ్ల : వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు యంబడి పోలయ్యపై అక్రమంగా వేసిన రౌడీ షీటర్ కేసును ఎత్తి వేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక వెల్ఫేర్ సెక్రటరీ యోహాను, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు యంబడి ఈశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన దళిత సంఘాలు, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాశినాయన మండలం సావిశెట్టిపల్లెకు చెందిన యంబడి పోలయ్య 7 సంవత్సరాలుగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడిగా పనిచేస్తున్నారన్నారు. అక్కడి రెవెన్యూ పొలం వందల ఎకరాలను రెవెన్యూ యంత్రాంగం ధనవంతులకు కట్టబెట్టిందన్నారు. న్యాయం కోసం పోరాడేవారిపై రౌడీ షీటర్ కేసు పెట్టడం సరికాదన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



రిలే దీక్షలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ పట్టణాధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి సాల్మన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, రవికుమార్, గురమ్మ, లక్ష్మీదేవి, రమాదేవి, సీతమ్మ, శాంతి, మరియమ్మ, ప్రమీలమ్మ, సుగుణమ్మ, రమణమ్మ రిలే దీక్షలో పాల్గొన్నారు.

జీపీఎఫ్ ఖాతాలు తెరవాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ ఉద్యోగ, కార్మికులకు జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పట్టణ కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రెండున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవుల ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతి పత్రం అందించారు.

యువకులచే బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న యువకులు

వల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వల్లూరు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలువురు యువకులు బండలాగుడు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ఈశ్వర్‌రెడ్డి, శివ ప్రసాద్ కలిసి 755 అడుగులు బండను లాగి మొదటి స్థానంలో నిలిచి రూ 3,116 గెలుచుకున్నారు. రామమోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి కలిసి 669.5 అడుగులు బండను లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ 2,116 గెలుచుకున్నారు. రామాంజనేయరెడ్డి, శ్రీను కలిసి 653.1 అడుగులు బండను లాగి మూడవ స్థానంలో నిలిచి రూ 1,116 గెలుచుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్ల జయరాజ్

ప్రొద్దుటూరు : స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్ల జయరాజ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు కొట్టివేసిందని తెలిపారు. 28 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పదే పదే పార్లమెంటు సమావేశాలప్పుడు ఆందోళన చేయడం సరైనది కాదన్నారు. ఎస్సీ రిజర్వేషన్ శాతం పెరిగిన జనాభాకు అనుగుణంగా 15 శాతం నుంచి 25 శాతం వరకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు సుధాకర్, ప్రతాప్, జాకోబ్, గోపాల్, సుదర్శన్, చందు, రాజు, మనోహర్, దళిత నాయకులు జయరాజు, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె రైతుభరోసా కేంద్రంలో గురువారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం వారు, డబ్ల్యూడీసీ – పీఎంకెఎస్‌వై 2.0 జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారి ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండవ రోజు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బద్వేలు మండల ఇన్‌చార్జి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఊటుకూరు కృషివిజ్ఞాన కేంద్రం సాంఘిక శాస్త్ర విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ప్రశాంతి వివిధ ధాన్యాలు, పప్పుదినుసుల ఆధారిత ఉత్పత్తులు, చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరించారు. మృతిక విభాగపు హెడ్ చైతన్యకుమార్ భూసార పరీక్షల ఆవశ్యకత, శాంపిల్ సేకరణ, ఫలితాల విశ్లేషణ, తీసుకోవాల్సిన చర్యలు, సేంద్రియ విధానాల ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలను వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మానస ఊటుకూరు కృషివిజ్ఞాన కేంద్రంలో జరిగే వివిధ విస్తరణ, పరిశోధన కార్యక్రమాల గురించి వివరించారు. రైతుల సందేహాలకు శాస్త్రవేత్తలు తగిన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో రైతులు, యువత పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మైదుకూరు : పౌష్టికాహారంపై మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వరలక్ష్మి

మైదుకూరు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి సూచించారు. పోషణ్ మాసోత్సవాలలో భాగంగా అన్నలూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వరలక్ష్మి మాట్లాడుతూ శిశువు పెరుగుదల కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు మల్లేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటి పెరట్లో ఆకుకూరలు, కూరగాయలు పండించుకుని పౌష్టికాహారం తయారు చేసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట : పౌష్టికాహారం తీసుకుంటే మహిళలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి సూచించారు. ఖాజీపేట మండలం బుద్దాయపల్లె, ముత్తూలూరుపాడు గ్రామాల్లో గర్భిణులకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాన్పు సమయంలో తల్లీ, బిడ్డకు ఇబ్బందులు వస్తాయన్నారు. ప్రతి మహిళ నెలకోసారి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వైఎస్సార్ కిట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం బీజేపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు వరుణ్‌కుమార్ రెడ్డి, డీఎల్.పార్వతి, శృతి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మైదుకూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆరవేటి హరికృష్ణ పాల్గొన్నారు.

నరసన్నపల్లెలో వైద్య పరీక్షలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని నరసన్నపల్లెలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం కింద వైద్య బృందం ప్రియాంక, మల్లేశ్వరమ్మ ఇంటింటా తిరిగి ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష ఏర్పాటు చేశారన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

మైదుకూరు : కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, నియోజకవర్గ కార్యదర్శి ఏవీ.శివరామ్, అధ్యక్షుడు పి.భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్ ఔట్ సోర్సింగ్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు, క్లాప్ డ్రైవర్లు, ఆఫీసు సిబ్బంది, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. రెండేళ్లు దాటినా కార్మికుల సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ విడుదలపై చలనం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, ఆలీ, చంద్ర, దాసరి సతీష్, రవి, రమేష్, హరి పాల్గొన్నారు.